క్లుప్తంగా

నేడు కారెంపూడిలో నూతన పింఛన్ల పంపిణీ

కారెంపూడి: పెంచిన పింఛన్లు, నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ పండుగ మంగళ వారం కారెంపూడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించడానికి అధికారులు ప్రజా ప్రతినిధులు సోమవారం ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా కొత్తగా మంజూరైన వారికి పింఛన్లు పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా పింఛన్‌దారులందరి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు వారికిస్తున్న నెలవారి పింఛన్లను రూ.3 వేలకు పెంచిన శుభ సందర్భంలో అలాగే మరి కొందరికి నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా ఒప్పిచర్ల గ్రామంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వ విప్ పీఆర్కే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడానికి ఆ గ్రామ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే చింతపల్లి గ్రామంలో కూడా గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పీఆర్కే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడానికి అక్కడ కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ప్రతి విద్యార్థి ఉత్తమంగా ఎదగాలి



వెల్దుర్తి: స్వామి వివేకానంద స్ఫూర్తితో శారదా మాత ఆశయాలైన త్యాగం, సేవా, భక్తి మార్గాలను ఆచరించాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని హారికా మోడల్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేసి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే విలువలతో కూడిన ఆశయాలను అవలంబించుకొని త్యాగం, సేవా మార్గాలను ఎంచుకోవాలన్నారు. విద్యార్థులకు రామకృష్ణ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హారిక, ఉపాధ్యాయులు, సభ్యులు మహేష్, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రవి, ముత్యాల పాపిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లారావుకు సేవారత్న అవార్డు




దాచేపల్లి : వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి, వాసవి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గరిణే పుల్లారావుకి సేవారత్న అవార్డు ప్రదానం చేశారు. నరసరావుపేటలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు పుల్లారావు సోమవారం తెలిపారు. వాసవి సేవా సమితి ద్వారా తాము చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ అవార్డు ప్రదానం చేశారని, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పుల్లారావు చెప్పారు. పుల్లారావు సేవారత్న అవార్డు అందుకోవటం పట్ల స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, ఆర్యవైశ్య నేతలు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని క్రోసూరు బస్టాండ్ వద్ద సోమవారం జరిగింది. ఘటనకు సంబంధించిన పట్టణ ఎస్‌ఐ కృష్ణారావు తెలిపిన వివరాల మేరకు.. పిడుగురాళ్ల మండలంలోని కోనంకి గ్రామానికి చెందిన బండారు వాసు (18) తన తండ్రి బాలరాజు ద్విచక్ర వాహనంపై కోనంకి నుంచి పిడుగురాళ్ల పట్టణం వైపు నుంచి కొండమోడు వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనటంతో వెనుక కూర్చున్న వాసు రోడ్డుపై పడటంతో లారీ ముందు చక్రం అతనిపై ఎక్కటంతో తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి బాలరాజుకు స్వల్ప గాయలయ్యాయి. తీవ్ర గాయాలైన వాసును గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ కృష్ణారావు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



దాచేపల్లి : విద్యుత్‌షాక్‌కు గురై వివాహిత మహిళ మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లికి చెందిన నాగెండ్ల మహేష్ భార్య కృపలమ్మ (35) ఈ ఘటనలో మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కృపలమ్మ ఇంటి ముందు ఉన్న ఇనుప తీగెపై బట్టలు ఆర వేస్తుంది. అప్పటికే తీగెకు కరెంట్ సరఫరా ఉండటంతో కృపలమ్మ షాక్‌కు గురై కిందపడింది. కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

దేశంలోనే అత్యధిక పెన్షన్ అందజేస్తున్న రాష్ట్రం

- సీఎం జగన్‌కు మీ దీవెనలు అందించండి
- ప్రభుత్వ విప్ పీఆర్కే



నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవ్వతాతలకు మనవడిగా, అక్కచెల్లమ్మలకు అన్నగా ప్రతి ఇంటి పెద్ద కొడుకుగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ పింఛన్ కానుక ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎంపీపీ ఏసూరి సాయిశంకర్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా రూ.3వేలు పెన్షన్ అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అన్నారు. గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు తూచా తప్పకుండా 100% హామీలను నెరవేరుస్తూ ప్రతి ఏటా రూ.250 చొప్పున పెంచుతూ రూ.3వేలు ఇచ్చారన్నారు. జాబు కావాలంటే బాబు రావాలని, రైతు రుణమాఫీ అని మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. దుర్గి మండల పరిధిలో గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ లబ్ధిదారులకు రూ.30.51కోట్లు పంపిణీ చేస్తే, వైఎస్సార్‌సీపీ హయాంలో 6,988 మంది లబ్ధిదారులకు నేటి వరకు రూ.124.53కోట్లు అందజేసినట్లు తెలిపారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థ ఏర్పాటు చేసి గ్రామాలలోనే పలు రకాల సేవలను ప్రజలకు అందిస్తూ ప్రజా సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం మనదన్నారు. రాష్ట్రంలో కాపు సోదరులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందుగా ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రజా ప్రతినిధులు,



దుర్గిలో లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

నేతలు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామాల వారీగా లబ్ధిదారులను వేదిక పైకి ఆహ్వానించి ఆయా గ్రామాల నాయకుల చేతుల మీదుగా పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సమతా వాణి, ఏఎంసీ చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, వైస్ ఎంపీపీలు ఊరిబండి ఏగయ్య, చల్లా శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కటకం రామారావు, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, యూత్ కన్వీనర్ ఎకటీల బుచ్చిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కటకం చిన వెంకటయ్య, నాగేశ్వరరావు, మన్నయ్య, వెంకటరామయ్య, నరసింహారావు, రామయ్య, కోటేశ్వరరావు, సీతారామయ్య, రమేష్ వెంకటరామయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పలు గ్రామాల నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తంగెడలో కొత్త పింఛన్లు పంపిణీ



దాచేపల్లి : మండల వ్యాప్తంగా కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. నగర పంచాయతీతో పాటు గ్రామాల్లో కొత్తగా 123 పింఛన్లు మంజూరయ్యాయి. మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, వైస్ ఎంపీపీలు షేక్ ఖాదర్‌బాషా, కొామెరబత్తిన విజయ్‌కుమార్, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ మండపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు

మాచవరం: మండలంలోని చెన్నాయపాలెం, రేగులగడ్డ గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు అయినట్లు దేవదాయ, ధర్మదాయ శాఖ ఈవో పుణ్యాల వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. చెన్నాయపాలెంలో సుగాలి తండాలో సేవాలాల్ దేవాలయానికి రూ.10 లక్షలు, రేగులగడ్డ గ్రామంలో ముత్యాలమ్మ దేవాలయానికి రూ.10 లక్షలు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు నుంచి నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఆయా గ్రామాల సర్పంచులు మండ్ల మంగమ్మ, జక్కుల కొండలు, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్రమ మద్యం పట్టివేత

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 37 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సమీర్‌బాషా సోమవారం తెలిపారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా గ్రామానికి చెందిన కావాటి సురేష్, గంజి శ్రీనివాసరావుల వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



కేసానుపల్లి హైస్కూల్‌లో ముగ్గులు పోటీల్లో పాల్గొన్న బాలికలు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న తంగెడ పాఠశాల ఉపాధ్యాయులు





సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

దాచేపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు సోమవారం జరిగాయి. సంక్రాంతి సెలవులు కావటంతో ముందస్తుగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబరాలు కన్నుల పండువలా జరుపుకున్నారు. ముగ్గుల పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలురకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి సంబరాల్లో విద్యార్థుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు చెట్టిపాగు ఏసురత్నం, ఎల్‌వీ రామిరెడ్డి, శంకరశెట్టి వెంకటేశ్వర్లు, నాగెండ్ల ఏసయ్య, వట్టిపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడిలో..

కారెంపూడి: స్థానిక ఆదర్శ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. సోమవారం నుంచి సంక్రాంతి సెలవుల నేపథ్యంలో పాఠశాలలో అందరూ కలసి ముందస్తు వేడుకలు జరుపుకున్నారు. భోగి మంటలు వేశారు. కోలాటమాడారు. సంక్రాంతి నాటికతో పాటు నృత్య ప్రదర్శనలిచ్చారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ ఎన్ నయోమి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు చాలా ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

మాచవరం: గ్రామాల్లో సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎంపీటీసీ చిట్టిప్రోలు గురవయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విప్రో సంతూర్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు సోమవారం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన సంకురాత్రి బిందుప్రియ, సంగు లక్ష్మి ప్రసన్న, కోట అనుష్క, ముండ్లపాటి రూపశ్రీ, బోనం రవళిలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాగిడి నరేష్, హెచ్‌ఎం సురేష్‌బాబు, వాసవి క్లబ్ సభ్యుడు మద్దు ఆంజినేయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నీలం వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

పిడుగురాళ్లరూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా తమ ప్రతిభను చూపించాలని అన్నారు. సంక్రాంతి సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. మొదటి బహుమతి రక్షిత, నందిని, రెండవ బహుమతి కవిత, నాగలక్ష్మి, మూడో బహుమతి నాగలాస్య, కవిత, నాల్గవ బహుమతి హారిక, కవిత, ఐదవ బహుమతి కుమారి, జయలక్ష్మిలు ముగ్గుల పోటీలలో గెలుపొందారని తెలియజేశారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు రోహిత్, మండల నాయకులు పుష్పరాజు, బ్రహ్మరెడ్డి, మహేష్, ధనుష్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో విద్యార్థినులు వేసిన ముగ్గులు



తుమ్మలచెరువులో బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి సాయికుమార్



సంక్రాంతి వేడుకల్లో ఉపాధ్యాయినులు

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్
- ఫైలేరియా వ్యాధి నివారణ చర్యలు



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మలేరియా జిల్లా అధికారి రవి రత్నాకర్

రెంటచింతల: గ్రామంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దీంతో వ్యాధులు దరిచేరవని జిల్లా మలేరియా అధికారి కె.రవి రత్నాకర్ అన్నారు. సోమవారం రెంటచింతలలోని పలు కాలనీలలో, తుమ్మకోట గ్రామంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు నర్రా కృష్ణారెడ్డి, కె.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నంశెట్టి అంకమ్మరావుతో కలిసి సందర్శించి ఫైలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించి రాత్రి సమయాలలో మొత్తం 617 మంది నుంచి రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించి ఫైలేరియా నివారణ చర్యలలో భాగంగా రక్తనమూనాలను సేకరించి పాజిటివ్ వచ్చిన వారికి కాళ్లు వాపు రాకుండా వెంటనే మందులు ఉచితంగా అందచేయడం జరుగుతుందన్నారు. ఇళ్లలో తాగిపడేసిన కొబ్బరి బొండాలు, వాహనాల పాతటైర్లు, నీటి తొట్లలో నిల్వ ఉన్న నీరు, నివాసాల ముందున్న సైడ్ కాల్వలలోని మురుగును తొలిగించక పోయిన దోమలకు ఆవాసాలుగా మారతాయని దీంతో మనం వ్యాధులతో కలిసి ఉన్నట్లు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. క్యూలెక్స్ దోమ వలన బోదకాలు వస్తుందని, నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన విషజ్వరాలైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దరిచేరవని అవగాహన కల్పించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో మలేరియా హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు సహకారంతో ఫైలేరియా, మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి నివారణ చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్.కోటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్‌లు సీతారామిరెడ్డి, మహేష్‌బాబు, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధుల అసహనం



సమావేశంలో మాట్లాడుతున్న మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి

మాచవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు ప్రతిసారి కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు మాత్రమే హాజరవుతున్నారని, మిగిలిన శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు ఎందుకు హాజరుకావడం లేదని, గైర్హాజరుతో సమావేశంలో ఎవరితో సమస్యలపై మాట్లాడాలని జెడ్పీటీసీ జె.శివాయాదవ్, పలువురు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శివాయాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని ఆక్షేపించారు. ఇలాంటివి పునరావృతం అయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలో రూ.354 కోట్లతో ప్రజాసంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిందన్నారు. అందరి సమన్వయ సహకారంతో ఇది సాధ్యపడిందని తెలిపారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలకు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరును వివరించారు. మండల స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్రా ఆటల పోటలకు డ్రా తీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. సమావేశంలో ఎంపీడీఓ యు.వరప్రసాద్, వైస్ ఎంపీపీలు చింతపల్లి నన్నేషైదా, చల్లగుండ్ల లక్ష్మయ్య, మండల కో–ఆప్షన్‌మెంబర్ మహమ్మద్ జానీ, డిప్యూటీ తహసీల్దారు సరోజ, ఎంపీటీసీలు, పలు గ్రామాల సర్పంచులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.12.50 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న ఎస్‌ఐ శివనాగరాజు

దాచేపల్లి : రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద అనధికారికంగా తరలిస్తున్న నగదును పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద తెలంగాణ నుంచి ఏపీకి వస్తున్న ఓ కారుని ఆపి తనిఖీ చేయగా అందులో ఉన్న రూ.12.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ దాసరి శివనాగరాజు చెప్పారు. వివరాలు ఇలా.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ సురేంద్రబాబు పర్యవేక్షణలో పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచి ఏపీకి వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. తెలంగాణ నుంచి వస్తున్న ఓ కారుని తనిఖీ చేయగా అందులో ఉన్న హైదరాబాద్‌కి చెందిన వైకుంఠ మధుసూధన్‌రావు వద్ద ఎటువంటి పత్రాలు లేకుండా రూ.12.50లక్షల నగదు తరలిస్తున్నట్లు గుర్తించారు. నగదు స్వాధీనం చేసుకుని ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు పంపించామని, అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చెప్పారు.

శిరిగిరిపాడులో బోరుబావి ఏర్పాటు



శిరిగిరిపాడులో బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ చింతా శివరామయ్య

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో ఎంపీపీ చింతా శివరామయ్య బోరుబావిని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలంలో ప్రజలు నీటి కోసం కష్టాలు పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా బోరుబావి ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఉపాధ్యక్షులు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ ఈగల అయ్యన్న, మాజీ సర్పంచ్ పులుసు నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, లింగాల రాఘవాచారి, శనగా వెంకటరెడ్డి, లింగయ్య, వజ్రాల మల్లయ్య, వీజీటీ ప్రెసిడెంట్ గురవయ్య, తాళ్ళ నాగిరెడ్డి తదితరులున్నారు.

మండాదిలో చోరీ

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో సోమవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పులి పద్మావతి ఉదయం 10 గంటలకు పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత నగదు కనిపించక పోవటంతో బీరువాలో ఉన్న బంగారు నగలను చూసుకోగా అవీ కనబడలేదు. ఆరు సవర్ల రింగుల చంద్రహారం, నాలుగు సవర్ల గాజులు, రెండు జతల చెవిదిద్దులు, 20 తులాల వెండి, రూ.80వేల నగదు చోరీకి గురైందని పోలీసు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమాచారమందుకున్న ఎస్‌ఐ శ్రీహరి ఘటనా స్థలాన్ని పరిశీలించి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంకు సమాచారమివ్వగా వారు హుటాహుటిన మండాది గ్రామానికి వచ్చి ఘటనా స్థలంలో వేలి ముద్రలు సేకరించారు.


పిండమార్పిడి ప్రక్రియతో ఒంగోలు జాతి కోడెదూడ



వేల్పూరులో పిండమార్పిడి ద్వారా జన్మించిన ఒంగోలుజాతి కోడెదూడ

క్రోసూరు: ఒంగోలు జాతికి చెందిన మేలురకం కోడెదూడను పుట్టించటంలో లాంఫామ్ శాస్త్రవేత్తలు, పశువైద్యులు మరోసారి విజయం సాధించినట్లు సోమవారం మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన వివరాలు తెలుపుతూ స్వదేశీ పరిజ్ఞానంతో పిండమార్పిడి ప్రక్రియ ద్వారా ఈ కోడెదూడను పుట్టించటం జరిగిందని తెలిపారు. ఏపీ పశుసంవర్ధకశాఖ లాంఫారం, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పిండమార్పిడి ప్రక్రియ ద్వారా కోడెదూడ పుట్టినట్లు చెప్పారు. అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామంలోని రైతు పి.వెంకట్రావుకు చెందిన నాటు ఆవు గర్భంలో మేలుజాతి ఒంగోలు జాతి పిండాన్ని గత ఏడాది మార్చి 3 వతేదీన ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 7వ తేదీన ఆరోగ్యవంతమైన ఒంగోలు జాతి కోడెదూడకు ఆవు జన్మనిచ్చిందన్నారు. లాంఫామ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు మార్గదర్శకత్వంలో పిండమార్పిడి చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో అండాలను సేకరించేందుకు ఏపీ పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణ, ఐవీఎఫ్, ఫలదీకరణ పిండాన్ని అభివృద్ధి చేయటంతో లాంఫామ్‌కు చెందిన డాక్టర్ ఎస్‌ఆర్ శ్రీకాంత్ సేవలందించినట్లు వివరించారు. ఆవును ఎంపికచేసి పిండాన్ని ఆవు గర్భంలో ప్రవేశపెట్టటానికి మండల పశువైద్యాధికారి క్రోసూ రు, దొడ్లేరు పశువైద్యులు డాక్టర్ మల్లయ్య సేవలందించారన్నారు.

యాదవ మహాసభ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా సిద్దాడపు



గురజాల : అఖిల భారతీయ యాదవ మహాసభ పల్నా డు జిల్లా అధ్యక్షుడిగా సిద్దాడపు గాంధీని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ వెంగళరావు యాదవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అఖిల భారత యాదవ సంఘం హక్కుల కోసం పోరాటం చేసినందుకు గాను సిద్దాడపు గాంధీని పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు యాదవ్ తెలిపారు. సిద్దాడపు గాంధీ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



దుర్గి: మండలంలోని రాజానగరం గ్రామ పంచాయతీ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం పొలాల్లో ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఎస్‌ఐ శివ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు గల పురుషుని శవం పొలాల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతుని ఫొటోను గుర్తించి సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే సెల్ నెంబర్ 9440796242 సంప్రదించాలన్నారు.